ONE click
ePaper
www.shanmukhavelugu.com



RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక



Good for Health
Best for Readers



PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 261

సోమవారం 05 అకోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.




## లోక్‌సభతో పాటు అసెంబ్లీలనూ రద్దు చేయాలి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 04)

ఎన్నికల వ్యవస్థ అంతా అక్రమాలమయమైందని, అందువల్ల లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ అస్తవ్యస్తమైన ఎన్నికల వ్యవస్థతో గెలిచిన ప్రధాని, హోం మంత్రులే కాదు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ అక్రమంగా పదవుల్లో ఉన్నట్లు భావించాలన్నారు. ఈవీఎంలను దుర్వినియోగం చేసి, గెలిచే ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధం కాదని ఆరోపించారు. ఖర్గే శనివారం కర్ణాటకలోని కలబురగిలో విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ▶2లో



## గృహ నిర్మాణంలో నవ శకం మొదలైంది: డిప్యూటీ సీఎం పవన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో రాష్ట్రంలో గృహ నిర్మాణంలో నూతన శకం మొదలైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్ 2.0 కింద 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనపై పవన్ స్పందించారు. దేశంలోనే తొలిసారిగా త్రీడీ ప్రింటింగ్ ఇళ్లు నిర్మించే కార్యక్రమం ద్వారా గృహ నిర్మాణ రంగంలో వినూత్నమైన ఘట్టానికి తెరలేచిందని అభిప్రాయపడ్డారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టును ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ▶2లో

## పాన్ ఐఐటీ శాశ్వత కౌన్సిల్.. అమరావతిలో ఏర్పాటు

- రాష్ట్ర వర్సిటీలు, ఐఐటీల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్
- 100 మంది ఐఐటీ దిగ్గజాలతో గ్లోబల్ మెంటార్ నెట్‌వర్క్
- రూ.500 కోట్లతో పాన్‌ఐఐటీ వెంచర్‌ఫండ్
- వచ్చే ఏడాది ఆరో తరగతి నుంచి ఏఐ పాఠాలు
- సీఎం చంద్రబాబు వెల్లడి
- పాన్ ఐఐటీ సమిట్‌లో 5 క్వాంటమ్ కంప్యూటర్ల ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

అమరావతిలో పాన్ ఐఐటీ శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అకడమిక్ నెట్‌వర్క్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా కలిపి ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోని 23 ఐఐటీల నుంచి పెద్ద ఎత్తున ఐఐటీయన్లు అమరావతికి రావడమే రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ అని తెలిపారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో శనివారం నిర్వహించిన ▶2లో

# మధ్యప్రదేశ్‌కే కాదు.. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ

- బుర్రిపాలెంలో 3 లక్షల పీఎంఏవై ఇళ్లకు భూమి పూజ
- రాష్ట్రానికి దశలవారీగా 9 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామన్న కేంద్రం
- దేశంలోనే తొలిసారిగా 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో పేదల ఇళ్ల నిర్మాణం
- వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి ప్రధానితో ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడి
- అమరావతిని క్వాంటం వ్యాలీగా, మెగా సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ్' కింద మూడు లక్షల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు, 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు.

**కేంద్రం అండ.. 9 లక్షల ఇళ్ల లక్ష్యం**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో నదుల ▶2లో



## అందుకే కళ్లు మూసుకున్నాం... చిన్న శ్రీనుపై బొత్స !

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

విజయనగరం జిల్లాలో స్థానిక ఎన్నికల రాజకీయం కంటే కూడా వైసీపీలో చిన్న శ్రీను ప్రకంపనలు తదనంతర పరిణామాలే ఎక్కువ హీట్ ని పుట్టిస్తున్నాయి. చిన్న శ్రీను పార్టీని వీడి నెల రోజులు అవుతున్నా ఆ ప్రభావం వైసీపీని స్థిమితం లేకుండా చేస్తోంది. తాజాగా చిన్న శ్రీను వియ్యంకుడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెండ్ అయ్యారు. దాంతో ఆగ్రహించిన ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. మరిన్ని వికెట్లు పడబోతున్నాయని చిన్న శ్రీను వర్గం ఒక వైపు సంకేతాలు ఇస్తోంది. విజయనగరం జిల్లా వైసీపీ అంటేనే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నంతగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామాల మీద బొత్స తనదైన శైలిలో స్పందించారు. ఎస్ కోట నియోజకవర్గంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడుతూ పార్టీని వీడిన వారిది దోపిడీయే అజెండా అని హాట్ కామెంట్స్ చేశారు.

పోతే ఏటవుతాది : బొత్స ఉత్తరాంధ్ర భాషలో మాట్లాడుతూ పార్టీ అన్నాక ఇలాంటివి సహజం అన్నారు. ఒకరిద్దరు నాయకులు బయటకు వెళ్ళినంత మాత్రాన ఏమవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఎప్పటికీ శాశ్వతం అన్నారు. వైసీపీకి జనంలో ఆదరణ ఉందని ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అందువల్ల ▶2లో



## భారతీయులకు రష్యాలో భారీగా ఉద్యోగాలు.. 70,000 మందికి అవకాశం!

- ఈ ఏడాది 70 వేల మంది భారతీయులకు రష్యాలో ఉద్యోగాలు
- నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం
- రష్యాతో వాణిజ్యం పెంపునకు భారత్ ప్రయత్నాలు
- చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్‌పై కీలక చర్చలు
- రష్యా సైన్యంలో చిక్కుకున్న 140 మంది భారతీయుల విడుదల



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 04)

భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్–రష్యా ▶2లో

## కూటమి పద్మవ్యూహం.... వైసీపీ తట్టుకోగలదా ?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

ఏపీలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహించనుంది. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా స్థానిక ఎన్నికలు జరిగాయి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి అంటే ఆనాడు పరోక్ష ఎన్నికలు జరిగాయి. మేయర్ జెడ్పీ చైర్మన్లను సభ్యులు ఎన్నుకునే వారు. దాంతో పెద్ద ఎత్తున సభ్యుల బలం కోసం ఏకగ్రీవాలను వైసీపీ ప్రోత్సహించింది అన్న విమర్శలు వచ్చాయి. అంతే కాదు ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేయకుండా అధికార బలంతో అడ్డుకుందని కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో జెడ్పీ ఎన్నికల నుంచి టీడీపీ మధ్యలోనే తప్పుకుని తన నిరసనను వ్యక్తం చేసింది. మొత్తానికి నూటికి తొంబై శాతం ▶2లో



## మానవత్వమే గొప్పదన్న త్రిపురనేని

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

సంప్రదాయాలు, ఆచారాల పేరుతో మనుషుల్ని విడదీసే ఏ సిద్ధాంతమైనా సమాజానికి కీడు చేస్తుందని, మానవత్వమే అన్నింటి కంటే గొప్పదని నమ్మి ఆచరించిన గొప్ప మానవతావాది కవిరాజు త్రిపురనేని రామస్వామి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కవిరాజు మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా గుంటూరు జిల్లా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం విజ్ఞాన వేదిక తెనాలి, ▶2లో

## జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి: షర్మిల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 04)

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ప్రధాని మోదీ ఏజెంట్ అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. భాజపాకు ఆరెస్సెస్ పని చేస్తున్నట్లుగానే, జ్ఞానేశ్‌కుమార్ ప్రధాని మోదీ కోసం పని చేస్తున్నారని విమర్శించారు.



శనివారం విజయవాడలో నిరసన చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. లేదంటే పదవి నుంచి ఆయన్ను తొలగించాలి. ఎన్నికల సంఘాన్ని మోదీ భ్రష్టు పట్టించారు. దేశంలోని ప్రతి పౌరుడు సీఈసీ చర్యలపై తిరగబడాలి. ▶2లో

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# మధ్యప్రదేశ్‌కే కాదు..
# ఆయన ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ

అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.

**దేశంలోనే తొలిసారిగా 3ఙ ప్రింటింగ్ టెక్నాలజీ :** ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3ఙ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు. కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు :** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా :** కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు.

**అమరావతి.. భవిష్యత్ మెగా సిటీ :** అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# లోక్‌సభతో పాటు అసెంబ్లీలనూ రద్దు చేయాలి

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ కూడా ఎన్నికల వ్యవస్థను మరింత దిగజార్చనుందన్నారు. గత నెల 30న నిర్వహించిన ఇండియా సమావేశంలో 20 పార్టీలు సర్ ప్రక్రియ పేదలు, నిరక్షరాస్యులు, అల్ప సంఖ్యాకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ముక్తకంఠంతో చెప్పాయన్నారు. గతంలో ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలంటే ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, విపక్ష నేత, మంత్రులు సభ్యులుగా ఉన్న కమిటీ నిర్ణయించేందన్నారు. మోదీ ప్రభుత్వం ఈ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి మంత్రులను చేర్చిందని దుయ్యబట్టారు. నిజాయతీపరులైన న్యాయమూర్తులుంటే తమ నిర్ణయాలను వ్యతిరేకిస్తారన్న భయం మోదీలో ఉందన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఇతర కమిషనర్లు ఏదైనా తప్పు చేసినా వారిని విచారించే అవకాశం లేకుండా చేశారని అసహనం వ్యక్తం చేశారు. సీఈసీలను గుప్పిట్లో పెట్టుకున్న ఎన్నికల వ్యవస్థతో ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ ఎన్నికల విధానాలపై 6 నుంచి దిల్లీలో ఆందోళన చేపట్టబోతున్నట్లు ఖర్గే ప్రకటించారు.

# అందుకే కళ్ళు మూసుకున్నాం... చిన్న శ్రీనుపై బొత్స !

నాయకులు వెళ్తే పార్టీకి ఏమీ కాదని చెప్పారు. స్వార్థంతో స్వలాభంతోనే కొందరు పార్టీని వీడిపోతున్నారు అని ఆయన మండిపడ్డారు. నాయకులు వెళ్ళినంత మాత్రాన కార్యకర్తలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని బొత్స చెప్పారు.

**ప్రేమ ఎక్కువైపోయి :** చిన్న శ్రీను పార్టీని వీడడం మీద బొత్స వ్యాఖ్యానిస్తూ అభిమానం ప్రేమ ఉన్న చోట కళ్ళు మూసుకుని పోతాయని వ్యాఖ్యానించారు. అందువల్లనే ఇన్నాళ్ళూ కొన్ని విషయాలని పట్టించుకోలేదని అన్నారు. అది తమ అవివేకం కూడా కావచ్చు లేదా అశ్రద్ధ కూడా కావచ్చు అని బొత్స తన మీదనే సెటైర్లు వేసుకున్నారు. ఆనాడు దృష్టి పెట్టకపోవడం వల్లనే ఇలాంటివి జరిగాయని, ఇలా ఫిరాయిస్తున్న వారి అసలు ఉద్దేశ్యాలు కూడా ఆలస్యంగానే అర్థం అయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. ఈసారి చాలా జాగ్రత్తగా ఉంటామని కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని ఆయన చెప్పారు.

**కష్టపడిన వారికే :** ఎవరైతే పార్టీ కోసం పనిచేస్తారో కష్టపడతారో వారికే ప్రాధాన్యత ఉంటుందని బొత్స అన్నారు. తాను క్యాడర్ కి అండగా ఉంటాను అని ఆయన హామీ ఇచ్చారు. ఏపీలో కూటమి పాలన తీరు మీద కూడా ఆయన నిప్పులు చెరిగారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఈ తరహా దోపిడీ పాలన చూడలేదని బొత్స మండిపడ్డారు. ప్రజలతో

## మొదటిపేజీ తరువాయి

కలిసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల మీద వైసీపీ ఉద్యమిస్తుందని బొత్స స్పష్టం చేశారు.

**బొత్స చెప్పిందేంటి :** ఇవన్నీ పక్కన పెడితే బొత్స చెప్పిందేంటి అన్నది వైసీపీలో చర్చ సాగుతోంది. సొంత మేనల్లుడు కాబట్టే చూసీ చూడనట్లుగా వ్యవహరించామని ఇపుడు ఆయన పశ్చాతాపం పడుతున్నారా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. బొత్సకు చిన్న శ్రీను పార్టీని వీడడం వంటి పరిణామం అయితే ఇబ్బందికరంగా మారిందనే అంటున్నారు. పోయే వారు పోతారు అని తేలికగా అంటున్నా జిల్లా రాజకీయాల్లో వైసీపీకి అలాగే బొత్స ఆధిపత్యానికి ఒక సవాల్ గానే ఈ పరిణామాలు ఉండబోతున్నాయని కూడా విశ్లేషిస్తున్నారు.

# భారతీయులకు రష్యాలో భారీగా ఉద్యోగాలు.. 70,000 మందికి అవకాశం!

సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ.. బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నై–వ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్–సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్–యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

# జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి: షర్మిల

ఓటు హక్కును పరిరక్షించుకోవాలి' అని పేర్కొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని షర్మిల చెప్పారు. శనివారం ఆంధ్రరత్నభవన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతను నాయకులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన 'నవతరానికి యువతరం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి సంబంధించి ప్రత్యేక పోస్టర్, క్యూఆర్ కోడ్‌ను ఏఐసీసీ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి పి.వి.మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు.

# మానవత్వమే గొప్పదన్న త్రిపురనేని

రామస్వామి కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో 'రామస్వామి యువజన సదస్సు' నిర్వహి ంచారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అక్షరాలను ఆయు ధంగా మలచిన కవిరాజు.. తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. త్రిపురనేని రామ స్వామి డబ్లిన్‌లో చదువుకునే రోజుల్లో పాశ్చాత్య దుస్తులకు బదులుగా మన సంప్రదాయ పంచె, తలపాగా ధరించి వెళ్లడమే కాకుండా, అక్కడి ఆంగ్లేయుల ప్రశ్నలకు ధైర్యంగా సమాధానమిచ్చిన ఆత్మగౌరవ శిఖరమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమ సమయంలో 'వీరగంధము తెచ్చినారము..' గేయం ద్వారా స్వాతంత్ర్య సమర యోధులకు గొప్ప స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, హైదరాబాద్‌లోని మానవ వికాస వేదిక అధ్యక్షులు బి.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ముత్తేవి రవీంద్రనాథ్, కవిరాజు మనవలు త్రిపురనేని సాయిచంద్, అట్లూరి అనిల్ తదితరులు ప్రసంగించారు.

# కూటమి పద్మవ్యూహం....వైసీపీ తట్టుకోగలదా ?

దాకా వైసీపీ గెలిచి లోకల్ బాడీస్ లో పాగా వేసింది. అయినా ఏమి లాభం, 2024 లో ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు పెద్దగా ఉపయోగపడలేదు, వైసీపీ చిత్తుగా ఓటమి పాలు అయింది.

**కట్ చేస్తే కూటమి సర్కార్ :** ఇక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో నిజానికి వైసీపీ మొదట పాల్గొనరాదనే చర్చ సాగింది అని అంటున్నారు. ఎపుడైతే మేయర్ జెడ్పీ చైర్మన్లు మునిసిపలి చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలులోకి తీసుకుని వచ్చారో దాంతో వైసీపీలో కొత్త ఆశలు చిగురించాయి. ప్రత్యక్ష ఎన్నికలు కాబట్టి కీలక పదవుల విషయంలో పార్టీ జెండా జగన్ ఇమేజ్ ఉపయోగపడతాయని భావిస్తూ ఆ పార్టీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఇక జగన్ అయితే వెరీ సీరియస్ అన్నట్లుగా లోకల్ బాడీ ఎన్నికలను తీసుకున్నారు. పదే పదే పార్టీ సమావేశాలలో ఆయన ఎన్నికలు చాలా కీలకం అని ప్రస్తావిస్తున్నారు. పార్టీ శ్రేణులను ఆయన ఎన్నికల సమరం వైపుగా నడిపించే ప్రయత్నం చేస్తూ ఉత్సాహం నింపుతున్నారు.

**అదే సందేహంగా :** అంతవరకూ బాగానే ఉంది కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆనాడు వైసీపీ చేసినట్లుగా అధికార బలం చూపిస్తే ఏమవుతుంది అన్నదే ఫ్యాన్ పార్టీలో సందేహంగా ఉంది. నామినేషన్ల నుంచే నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు ప్రతిపక్షాలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉంటుందా అని చర్చిస్తున్నారు. అభ్యర్థులను నిలబెట్టడం వరకూ అయితే వైసీపీ అధినాయకత్వం వారికి ఉత్సాహం ఇస్తోంది. అయితే వారు రంగంలో చివరి దాకా ఉండాలి. అధికార కూటమి ఒత్తిళ్లను తట్టుకోవాల్సి ఉంటుంది. అంతే కాదు పోలీసులను ప్రయోగిస్తే ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక అభ్యర్థులుగా ఉన్న వారి చరిత్రను మొత్తం తిరగతోడే చాన్స్ ఉంది. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చే కష్టాలను నష్టాలను భరిస్తూ వైసీపీ శ్రేణులు ఎంతవరకూ ముందుకు వెళ్తాయి అన్నది పార్టీ పెద్దలలో కూడా ఉంది అని అంటున్నారు.

**నిలిచి పోరాడితేనే :** అన్ని ఇబ్బందులు అధిగమించి నిలిచి పోరాడితేనే వైసీపీ గెలిచినట్లు అని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకూ చూస్తే ప్రజాభిప్రాయంలో పెద్దగా తేడా ఏమీ ఉండదని అంటున్నారు. ఇంకా కూటమి చేతిలో సగం పాలన ఉండగా జనాలు ప్రతిపక్షాన్ని గెలిపించి అభివృద్ధిని తమ ప్రాంతంలో దూరం చేసుకోరని కూడా అంటున్నారు. అందువల్ల వైసీపీ పెద్ద ఎత్తున గెలిచేస్తుంది అన్నది ఆ పార్టీలో ఉత్సాహం కోసం అన్నట్లుగానే చూడాలని అంటున్నారు అదే సమయంలో వైసీపీ తుది వరకూ పోరాడి తన ఓటు బ్యాంక్ ని కాపాడుకుంటూ నిలిస్తే మాత్రం అదే అసలైన గెలుపుగా చూడాలని అంటున్నారు. అధినాయకత్వం కూడా అందుకోసమే పోటీకి దింపుతోందని చెబుతున్నారు. మరి వైసీపీ తట్టుకుంటుందా అన్నదే అతి పెద్ద ప్రశ్నగా ఉంది.

# పాన్ ఐఐటీ శాశ్వత కౌన్సిల్.. అమరావతిలో ఏర్పాటు

పాన్ ఐఐటీ ఏపీ సమిట్–2026 ముగింపు కార్యక్రమం, విలేకర్ల సమావేశంలో సీఎం మాట్లాడారు. క్యూ–శివ పేరుతో రూపొందించిన ఐదు క్వాంటమ్ కంప్యూటర్లు, 4కెల్విన్ ప్రాసెసర్, క్వాంటమ్‌పై రాసిన పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలివీ..

**పరిశ్రమ, విద్యా సంస్థలు, ప్రభుత్వం కలిసి..**

పరిశ్రమ, విద్యాసంస్థలు, ప్రభుత్వం కలిసికట్టుగా స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించాలి. వెంచర్‌ఫండ్ కార్పస్‌ను స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఇవ్వనున్నట్లు ప్రకటించడం సంతోషంగా ఉంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది. ఐఐటీయన్ల అత్యుత్తమ మేధస్సుతో అమరావతి ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా తయారవుతుంది. ఇక నుంచి ఏటా పాన్ ఐఐటీ అమరావతి సమిట్ ఏర్పాటు చేసి, వివిధ అంశాలపై చర్చిద్దాం. సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోగలం. ఏఐ వినియోగంతో రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయాన్ని 18 శాతం పెంచగలగడమే ఇందుకు నిదర్శనం. ఏపీని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేలా పాన్‌ఐఐటీ మేధస్సు సహకారం అందిస్తుందని ఆకాంక్షిస్తున్నా.

పాన్ ఐఐటీ సదస్సు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఐఐటీ అలుమ్నీ ఛైర్మన్ ప్రభాత్‌కుమార్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు

**50 లక్షల మంది ఏఐ నిపుణుల్ని అందిస్తాం**

ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా ఏపీ నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వచ్చే ఏడాది నుంచి పాఠశాలల్లో ఆరో తరగతి నుంచే ఏఐ సిలబస్ తీసుకొస్తాం. ఏఐతో పాటు ఆంత్రప్రెన్యూర్ నైపుణ్యాలు నేర్పిస్తాం. ఐఐటీలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తాం. కొన్ని రోజులు రాష్ట్ర వర్సిటీల్లో, మరికొన్ని రోజులు ఐఐటీలో చదువుతారు. దీనికయ్యే ఖర్చులో ప్రభుత్వం 50% భరిస్తుంది. ఐఐటీ సిలబస్‌ను ఉన్నత విద్యలో అమలు చేస్తారు. దీంతో విద్యార్థుల నైపుణ్యం మరింత పెరుగుతుంది. అధ్యాపకులకు ఐఐటీయన్లు శిక్షణ ఇస్తారు. ఐఐటీయన్ల ఆలోచనలు సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాభివృద్ధి మరో స్థాయికి వెళ్తుంది.

**రెండేళ్లలో కమర్షియల్ క్వాంటమ్ కంప్యూటర్లు**

వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఆపరేషన్స్ మొదలవుతాయి. ఐబీఎం– టీసీఎస్, ఎల్అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ కంప్యూటర్ అమరావతి నుంచి ఆపరేట్ అవుతుంది. 156 క్యూబిట్ క్వాంటమ్ సిస్టమ్ వచ్చేలోగానే అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీకి అవసరమైన మౌలిక వసతులు సిద్ధమవుతాయి. క్యూ–శివ లాంటి మినీ క్వాంటమ్ కంప్యూటర్లు సైతం అందుబాటులోకి వచ్చాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాలు, క్వాంటమ్ కంప్యూటర్లు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాం. వచ్చే రెండేళ్లలో కమర్షియల్ క్వాంటమ్ కంప్యూటర్లను ఉత్పత్తి చేస్తామని క్వాంటమ్ సంస్థలు చెబుతున్నాయి. సైబరాబాద్ ప్లస్‌గా, నెట్ జీరో గ్రీన్ ఎనర్జీ, 50% పచ్చదనంతో అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. జాతి నిర్మాణంలో ఐఐటీయన్లు అంతా భాగమవుతున్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేలా ఐఐటీయన్లు సహకరించాలి. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు.. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది' అని తెలిపారు.

**పాన్ ఐఐటీ డిక్లరేషన్ విడుదల**

అనంతరం పాన్‌ఐఐటీ అమరావతి సమిట్ డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. అమరావతిలో ఏపీ ప్రభుత్వం–పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో శాశ్వత పాన్‌ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటు. డీప్‌టెక్ అభివృద్ధికి నోడల్ సంస్థగా పాన్‌ఐఐటీ అమరావతి కౌన్సిల్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా రూ.500 కోట్లతో పాన్‌ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల్లో పరిశ్రమల భాగస్వామ్యంతో 10 ఇండస్ట్రీ చైర్లు ఏర్పాటు స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేసేందుకు 100 మంది ఐఐటీ దిగ్గజాలతో గ్లోబల్ మెంటార్ నెట్‌వర్క్ ఏర్పాటు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక ఐఐటీల నుంచి రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలకు టెక్నాలజీ బదిలీ. ఇందులో భాగంగా వర్సిటీల్లో ఎక్స్‌లెన్స్ సెంటర్లు, ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీలో భాగంగా క్వాంటమ్–ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్–డిఫెన్స్, హెల్త్, అగ్రిటెక్‌లాంటి రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేలా చర్యలు.

# గృహ నిర్మాణంలో నవ శకం మొదలైంది: డిప్యూటీ సీఎం పవన్

అత్యాధునిక త్రీడీ సాంకేతికతతో బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో 177 ఇళ్ల నిర్మాణం చేపట్టడంపై అభినందనలు తెలిపారు. కేవలం 10 రోజుల్లోనే పూర్తిస్థాయి ఇంటి నిర్మాణం, వ్యర్థాలను గణనీయంగా తగ్గించడంతో పాటు నాణ్యత, దృఢత్వం పెరుగుతాయని పవన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించే దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి, సాంకేతిక ఆవిష్కరణలకు మద్దతుగా నిలుస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సాంకేతికత, వేగం, నాణ్యత, సంక్షేమం.. ఈ నాలుగింటినీ అనుసంధానిస్తూ కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోందన్నారు.

# గ్రంధాలయంలో చదవటం మాకిష్టం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు నందు చదవటం మాకిష్టం కార్యక్రమం, నెలలో మొదటి ఆదివారం అయినందున గ్రంథాలయం లో ఉన్న పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. పిల్లలతో నీతి కథలు సొంతంగా చెప్పించటం, చదివించడం జరిగింది. తదుపరి గ్రంథాలయ సిబ్బంది పిల్లలకు మ్యూజికల్ చైర్స్, నంబర్స్ గేమ్, తదితర ఆటలు ఆడించటం జరిగింది. ఈ సందర్భంగా ఉప గ్రంథపాలకురాలు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల జ్ఞానం, ఆలోచనా శక్తి, భాషా నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఉపయోగంగా ఉంటుంది. తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలకు కేటాయించి అరుబయట ఆటలాడటం అలవాటు చేస్తే చుట్టుపక్కల ఉండే పిల్లలతో కలిసి ఆడుకోవడాన్ని ప్రోత్సహించాలి. ఆటలు ఆడుతూ ఉంటే పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుంది. లైబ్రరీకి, మార్కెట్ కి పార్క్‌కు, షాపింగ్‌కు తీసుకొని వెళ్లడం, కొద్దిసేపు పిల్లలకు మాటలు చెప్పడం వంటి పనులు పిల్లల మానసిక వికాసానికి తోడ్పాడతాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది యం శ్రీనివాసులు, డి సందీప్, యస్ అనిల్ బాబు, పిల్లలు, లక్ష్మీ పాల్గొన్నారు.



# మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌కు స్వచ్ఛ అవార్డు డిఎం లావణ్యను సత్కరించిన బ్రాహ్మణ ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 4)

స్వచ్ఛ ఆంధ్ర అవార్డులలో స్వచ్ఛ బస్టాండ్ గా పేరు సంపాదించి అవార్డు అందుకున్న మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య ను, బ్రాహ్మణ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రం మార్కాపురం లోని ఆర్టీసీ డిపో నందు ఆదివారం బ్రాహ్మణ సంఘం సభ్యులు గోపాలుని హరిహరరావు తన బృందంతో కలిసి డిపో మేనేజర్ లావణ్యకు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. 8 నెలల కాల వ్యవధిలోనే ఆర్టీసీ బస్టాండ్ ను స్వచ్ఛతగా మార్చి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేసిన మీరు ప్రయాణికుల కోసం మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని సంఘ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలుని హరిహరరావు, కమలపురి శ్రీనివాస్, వాలిచర్ల కేశవరావు, ధూళిపాళ మధు, గోపాలుని రమేష్, శేషసాయి, నరసింహారావు, రామకృష్ణ, సుబ్రమణ్యం, ఆర్టీసీ యూనియన్ నాయకులు శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.




ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
05.10.26 సోమవారం

# ఆశావాహుల్లో పెరుగుతున్న ఆశలు

## చైర్మన్ గిరి, కౌన్సిలర్ల అభ్యర్థిత్వాల కోసం పలువురు ప్రయత్నాలు

## 2029 ఎన్నికలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికకు ప్రధాన పార్టీల ప్రయత్నాలు








(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 4)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లోగా ప్రారంభించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం బిసి రిజర్వేషన్ పై ఇచ్చిన జీఓను రద్దు చేయడంతో పాటు వైసీపీ పిటీషన్లను కూడా హైకోర్టు కొట్టివేసింది. ఏ క్షణంలోనైనా మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ రానుంది. కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ పదవి పై పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఛైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండడంతో ఆర్థిక, అంగ బలంతో పాటు మంచి పేరు, ప్రజలకు అందుబాటులో ఉండే వారిని అభ్యర్థులుగా నిలపాలని ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నారు. 2011లో కనిగిరి మున్సిపాల్టీ ఏర్పడింది. ఇప్పటికి రెండు సార్లు ఎన్నికలు జరగ్గా రెండు సార్లూ బిసిలకు రిజర్వుడ్ అయ్యింది. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో రిజర్వేషన్ కేటగిరిలో మున్సిపల్ ఛైర్మన్ పదవి ఓసిలకు గాని లేక ఎస్సీలకు రిజర్వుడ్ అవుతుందనే ఆశతో పలువురు నాయకులున్నారు. కనిగిరిలోని 32 వార్డుల్లో 34 వేల మంది ఓటర్లున్నారు. ఒక్క మాచవరం వార్డులో అత్యధికంగా 1470 మంది ఓటర్లు ఉన్నారు. ప్రధాన పార్టీలు అయిన టిడిపి, వైసీపీలు గట్టి అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నాయి. ఎమ్మెల్యే ఉగ్ర అభివృద్ధే ఎన్నికల అజెండాగా చూపుతూ ఛైర్మన్ అభ్యర్థిత్వంతో పాటు 32 మంది కౌన్సిలర్ల ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఏ వార్డు ఏ కేటగిరికి రిజర్వు అవుతుందో అన్న విషయం పై అధికార పార్టీ నాయకులకు ఓ అవగాహన ఉన్నట్లు సమాచారం. కూటమి నుండి ఒక్కో వార్డుతో పాటు ఛైర్మన్ పదవి కోసం ముగ్గురు చొప్పున అభ్యర్థుల జాబితాను అధిష్టానానికి పంపుతానని టిడిపి అధిష్టానమే అభ్యర్థుల ఎంపిక చేస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారికి చెబుతున్నారు. కనిగిరి పట్టణంలో టిడిపి నాయకులు వార్డుల వారీగా కెఎస్ఎస్ సభ్యులతో సమావేశమై అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు శ్రీకారం చుట్టారు. ఛైర్మన్ పదవి ఓసిలకు రిజర్వు అయితే కూటమి తరుపున ఆర్యవైశ్యులకు ఛైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయి. ఎమ్మెల్యే ఉగ్ర కనిగిరి పట్టణంలో బలమైన పట్టు సాధించేందుకు వైశ్యులకే అవకాశం ఇస్తారనే ప్రచారం సాగుతుంది. ఛైర్మన్ అభ్యర్థిత్వాల్లో సిండికేట్ వ్యాపారి గోనుగుంట్ల పవన్ కుమార్ ముందు వరుసలో ఉన్నారు. పిఏసిఎస్ ఛైర్మన్ అద్దంకి రంగబాబు కూడా టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. టిడిపి సీనియర్ నేత చిరంజీవి తనకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే ఎమ్మెల్యే ఉగ్రను కలిశారు. అనుకోని పరిస్థితుల్లో రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం ఇస్తే రాష్ట్ర తెలుగు రైతు నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, కొత్తూరుకు చెందిన యువనేత అచ్చాల రవిలు పోటీకి సిద్ధమయ్యారు. మరలా బిసి లకు రిజర్వు అయితే పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ పోటీకి ఖాయమని చెప్పవచ్చు. ఎస్సీలకు రిజర్వు అయితే దాసరి బాబ్జి ముందు వరుసలో ఉండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే ఉగ్ర మాత్రం కెఎస్ఎస్ సభ్యుల అభిప్రాయం మేరకు ఛైర్మన్ అభ్యర్థిత్వం ఆశించే వారి ముగ్గురు పేర్లను అధిష్టానంకు పంపుతానని, వారే అభ్యర్థిని నిర్ణయిస్తారని అంటున్నారు. ఛైర్మన్ అభ్యర్థి ఎవరైనా సునాయసంగా గెలవాలంటే 32 వార్డుల్లో కౌన్సలర్ అభ్యర్థులుగా పార్టీ బలంతోపాటు వ్య.క్తిగత ఇమేజ్ ఉన్న వారికి టిక్కెట్లు కేటాయించాలని ఎమ్మెల్యే ఉగ్ర ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉంటే కూటమి మద్ధతుతో 12వ వార్డు నుంచి సిపిఐ నాయకులు సయ్యద్ యాసీన్ పోటీ చేయడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కనిగిరి మున్సిపాల్టీలో టిడిపికి సుమారు 7200 మెజార్టీ వచ్చింది. కూటమి పార్టీల గ్రాఫ్ పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 8000కు పైగా మెజార్టీ వస్తుందన్న ధీమాతో కూటమి నేతలున్నారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి వల్ల ప్రజల్లో ఆదరణ మాకే ఉందని టిడిపి నాయకులు పూర్తి ధీమాతో ఉన్నారు. ఇలా ఉంటే వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం మున్సిపల్ ఎన్నికల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉగ్ర రాజకీయాలను వ్యూహాలను తిప్పికొట్టి ఎలాగైనా వైసీపీ జెండా ఎగరాలని పార్టీ క్యాడర్‌కు దిశానిర్ధేశం చేశారు. వైసీపీ తరుపున ఛైర్మన్ పదవి కోసం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పులి శాంతి, పార్టీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తమ్మినేని సుజాతలు పోటీకి సై అంటున్నారు. అధిష్టానం ఆదేశిస్తే తాను పోటీలో ఉంటానని మాజీ పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వై ఎం ప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎస్సీలకు రిజర్వు అయితే న్యాయవాది ఏఎంసి మాజీ ఛైర్మన్ సాల్మన్ రాజు పోటీలో ఉండే అవకాశాలున్నాయి. బిసిలకు రిజర్వు అయితే మాజీ కౌన్సిలర్ ఆర్ శ్రీనివాసయాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసయాదవ్‌లు పోటీలో ఉండే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికలు ఇరు పార్టీలకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. గత ఎన్నికల్లో 20 వార్డులను గెలిచి ప్రతిపక్షం లేకుండా చేసిన చరిత్ర వైసీపీకి ఉంది. పూర్వ వైభవాన్ని కాపాడుకునేందుకు ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతమయ్యేనా అనే చర్చ జరుగుతుంది. టిడిపి మాత్రం కనిగిరి పట్టణంలో ఎక్కడా జరగని అభివృద్ధి జరుగుతుందని కనిగిరి మున్సిపాల్టీలోని ప్రజలు కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టాలని, వైసీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావనే ధీమాతో టిడిపి శ్రేణులున్నాయి. ఛైర్మన్, కౌన్సిలర్ల రిజర్వేషన్లు ప్రకటించి, నోటిఫికేషన్ ఇస్తే ప్రజాప్రతినిధులు అయ్యేందుకు ఇరు పార్టీల నాయకులు ఉవ్విలూరుతున్నారు.

# ఎస్పీ బాస్ కు సవాళ్లు

### పశ్చిమాన వరుస చోరీలు
### రికవరీలు శూన్యం
### వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత
### ఎస్పీతో పాలన గాడిన పడేనా




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 4)**

మార్కాపురం జిల్లా ఏర్పాటైన అనంతరం ప్రకాశం జిల్లా నుంచి పోలీస్ శాఖను విభజిస్తూ మార్కాపురంలో ఏర్పాటు చేశారు. నిన్నటి మొన్నటి వరకు ప్రకాశం జిల్లా ఎస్పీ మార్కాపురం జిల్లాకు ఇన్చార్జిగా వ్యవహరించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన మార్కాపురం కొత్త జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనాకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మార్కాపురం ప్రాంతంలో కీలకమైన ప్రాంతాలైన మార్కాపురం, కనిగిరి, ఎర్రగొండపాలెం, పొదిలి, గిద్దలూరు, పామూరు ప్రాంతాలలో ఇటీవలన వరస చోరీలు జరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తున్నాయి. మార్కాపురం పట్టణంలోని విజయ టాకీస్ ఏరియా బజార్లో 15 తులాల బంగారు ఆభరణాలను దోచుకు వెళ్లారు. ఇంతకు ముందు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో సుమారు 25 తులాల ఆభరణాలు చోరీ చేసుకొని వెళ్లి దొంగలు పోలీసులకు సవాలు విసిరారు. పోలీసులు కేసును చేదించిన బంగారు ఆభరణాలు రికవరీ చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. కంభ, గిద్దలూరు ప్రాంతాలలో జరిగిన దొంగతనాలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో వర్ష దొంగతనాలు చోటు చేసుకుంటున్న రాత్రిపూట దస్తి నిర్వహించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. గతంలో ఒక కూల్ డ్రింక్ దుకాణంలో భారీ ఎత్తున బంగారు ఆభరణాలు స్టోరీ జరిగిన ఘటనను చేదించడంలో పోలీసులకు సుమారు 8 నెలల సమయం పట్టింది. పోలీసులు కేసును చేదించడంలో విఫలమవుతున్నారు. ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సీసీ కెమెరాలు ఫోర్ టీం ఉన్నా కూడా దొంగలను గుర్తించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. రాత్రిపూట గస్తీ బీట్లు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రం శివారు ప్రాంతంలో పోలీసులు నిఘా ఇటీవల పూర్తిగా కోరబడింది. జిల్లా ఎస్పీ వచ్చిన నేపథ్యంలో నైనా పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. (తరువాయి 4లో...)

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టంగా ముందస్తు చర్యలు చేపట్టాలి

### ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 4)**

రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశించారు. ఆదివారం మార్కాపురం జిల్లాలోని పోలీస్ ప్రధాన కార్యాలయం నందు జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్నికల భద్రతా చర్యల పై ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల పై పూర్తి స్థాయి సమాచారాన్ని స్థానిక ఎస్ఐలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో గొడవలు, ఘర్షణలు జరిగిన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా గుర్తించాలని ఆదేశించారు. గత ఎన్నికలకు సంబంధించి కేసులు నమోదైన గ్రామాల్లో పరిస్థితులను నిరంతరం (తరువాయి 4లో...)

# స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

### వైసిపి క్యాడర్‌కి పిలుపునిచ్చిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి అని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఒంగోలు పార్టీ ఆఫీస్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంపీపీ జడ్పీటీసీ సభ్యుల సన్మాన కార్యక్రమం, ఒంగోలు కార్పొరేషన్, దర్శి మున్సిపాలిటీ, చీమకుర్తి మున్సిపాలిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ రాబోవు స్థానిక మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో వైస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తున్నది దానికి సిద్ధంగా ఉండాలి (తరువాయి 4లో...)



# స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

అని పిలుపునిచ్చారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని అన్నారు. రాష్ట్రం లో కడప జిల్లా వైస్సార్సీపీ కి కంచుకోట అంటారు అని కాని నా దృష్టిలో ప్రకాశం జిల్లా వైస్సార్సీపీ కి కంచుకోట అని అన్నారు. రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది అని, ఏ ఒక్క హామీ కూడా అమలు చేసే పరిస్థితి లేదన్నారు. మన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరు లబ్ది పొందారని అన్నారు. అందుకని రాబోవు స్థానిక ఎన్నికలలో అందరం కలిసి కట్టుగా ఈ కూటమి ప్రభుత్వం పై పోరాటం చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలి అని అన్నారు. ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో మన పార్టీ సత్తా చాటాలి అని అన్నారు, దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మన జిల్లాకు సీనియర్ నాయకులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి రీజినల్ కో ఆర్డినేటర్ గా రావడం చాలా సంతోషంగా వుందన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో వైస్సార్సీపీ పోటీ చేస్తుందని, ప్రతి కార్యకర్తకు అండగా నియోజకవర్గ ఇంచార్జ్‌లు, తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ తూమాటి మాధవరావు, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపత్రి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి బాబు, అసెంబ్లీ పరిశీలకులు, మెంబెర్స్, తదితరులు పాల్గొన్నారు.





## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి హనుమంతరావు పరిచయ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 4)
కృష్ణ, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం హనుమంతరావు పరిచయ కార్యక్రమం జిల్లా కార్యదర్శి ఆంగోతు శ్రీనివాసరావు అధ్యక్షతన మాచర్ల పట్టణంలోని పెన్షనర్ బంగ్లా నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. పట్టణంలోని పలు విద్యాసంస్థల ఉపాధ్యాయులు డైరెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును హనుమంతరావుకి వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ హనుమంతరావు అందరికీ సుపరిచితుడు అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడగలరని, అందుకే హనుమంతరావు బలపరచవలసినదిగా వారు కోరారు. ఈ కార్యక్రమాన్ని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు , పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన రావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఖాసీం పీరా, జిల్లా సహాధ్యక్షులు జెవిడి నాయక్, మాచర్ల మండల అధ్యక్షులు షేక్ నసీర్, మండల ప్రధాన కార్యదర్శి ఎన్ ఆదినారాయణ, సీనియర్ నాయకులు గాలీబ్ సాహెబ్, జి కిరీటిరెడ్డి, శాంతాభాయి, పట్టాభిరామారావు, ఎస్‌విఎస్ నాగరాజు, పల్లారామారావు, కేశవరెడ్డి, కృష్ణవేణి జూనియర్ కాలేజ్ డైరెక్టర్ వై వెంకట్రామయ్య, పల్నాడు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎన్ శివభాస్కర్, మాచర్ల ప్రాంతీయ శాఖల బాధ్యులు, మహిళలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేశారు.

## ఒంగోలులో 'అమెజాన్ నౌ' ను విస్తరించిన అమెజాన్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)
అమెజాన్ తన అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ సేవ అమెజాన్ నౌను భారతదేశవ్యాప్తంగా 120కి పైగా నగరాలకు వేగంగా విస్తరించినట్లు ప్రకటించారు. విశాఖపట్నం, ఒంగోలు, కర్నూలు, రాజమండ్రి, నరసరావుపేట, ప్రొద్దుటూరు, తెనాలి, ధర్మవరం, నంద్యాల, తిరుపతి, గుంటూరు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురంలుఉన్నాయి. కేవలం రెండు వారాల్లోనే ఈ సేవ పరిధి రెట్టింపైంది. అమృత్సర్, అబోహర్, జలంధర్, అంబాలా, మంగళూరు, మణిపాల్, వైజాగ్, కొచ్చి, చంగనస్సేరి, భువనేశ్వర్, కార్వార్ వంటి నగరాల్లోని వినియోగదారులు ఇప్పుడు అమెజాన్ నౌ ద్వారా నిమిషాల్లోనే డెలివరీలు అందుకుంటున్నారు. ఈ సేవ పదుల వేల సంఖ్యలో రోజువారీ నిత్యావసర వస్తువుల విస్తృత ఎంపికను అందిస్తోంది. కిరాణా సరుకులు (పండ్లు, కూరగాయలు, ఫ్రోజెన్ ఫుడ్తో సహా), పర్సనల్ కేర్, ఫ్యాషన్, బ్యూటీ నుంచి చిన్న గృహోపకరణాలు, హోమ్, కిచెన్ ఉత్పత్తుల వరకు మరెన్నో. దాదాపు 800 మైక్రో-ఫుల్ఫిల్మెంట్, అర్బన్ ఫుల్ఫిల్మెంట్ కేంద్రాల నెట్వర్క్ ద్వారా ఈ ఆర్డర్లను పూర్తి చేస్తున్నారు. ఈ పండుగ సీజన్లో విస్తరణను కొనసాగిస్తూ అత్యంత వేగవంతమైన డెలివరీతో అత్యంత విస్తృతమైన ఉత్పత్తుల ఎంపికను అందించేందుకు మేము ఎదురుచూస్తున్నామని అమెజాన్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎవ్రీడే ఎసెన్షియల్స్, హర్ష్ గోయల్ తెలిపారు.

## ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టంగా ముందస్తు చర్యలు చేపట్టాలి



పర్యవేక్షిస్తూ అదనపు నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని స్థానిక ఎస్ఐలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. పాత రౌడీషీటర్లు, పాత నేరస్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల పై చట్టపరమైన పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు నిరోధక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు పోలీసుల పై నమ్మకం కలిగే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల గస్తీ, నిఘా, సమన్వయాన్ని మరింత పెంచాలని తెలిపారు. చిన్నపాటి వివాదాలు సైతం పెద్ద ఘర్షణలకు దారితీయకుండా ముందస్తుగానే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల భద్రతకు సంబంధించి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్కాపురం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడిన జిల్లాగా గుర్తింపు పొందేలా సమర్థవంతంగా పనిచేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, కనిగిరి ఇన్చార్జి డిఎస్పీ శ్రీధర్‌తో పాటు జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఎస్పీ బాస్ కు సవాళ్లు

**విచ్చలవిడిగా గంజాయి మత్తులో జోగుతున్న యువత**

మార్కాపురం జిల్లాలో గంజాయి బ్యాచ్ విచ్చలవిడిగా ఇటీవల కాలంలో ఎక్కువ సాగుతున్నాయి. ఇటీవలన ఓ గంజాయి బ్యాచ్ని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు కిలో గంజాయి పట్టుబడింది. గంజాయి ప్యాకెట్లు చిన్న చిన్నవిగా చేసి యువతే లక్ష్యంగా అక్రమార్కులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి ఎక్కువగా శ్రీశైలం నుంచి తీసుకువచ్చి మార్కాపురం కేంద్రంగా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. గతంలో రైల్వే స్టేషన్ కేంద్రంగానే గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసు విచారణలో తేలిన ఎటువంటి చర్యలు లేవు. జిల్లా అయిన నేపథ్యంలో ఇటీవలన గంజాయి బ్యాచి ఆగడాలు ఎక్కువయ్యాయి. నిత్యం ఆర్టిసి బస్టాండు పూల సుబ్బయ్య కాలనీ ఏరియా అల్లూరు పోలేరమ్మ గుడి ప్రాంతం,మార్కెట్ యార్డు, ఎస్టేట్ ఏరియా ప్రాంతాలలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్న పోలీసుల నియంత్రణ ఏమాత్రం లేదు. గతంలో ఓ మూట భారీ ఎత్తున గంజాయిని మార్కెట్ యార్డు సమీపంలో బెంగళూరుకు తరలిస్తుండగా పోలీసులు పక్క సమాచారం తో నిందితులను పట్టుకొని అరెస్టు చేసిన గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. జిల్లాలోని కంభం గిద్దలూరు కనిగిరి ఎర్రగొండపాలెం, ప్రాంతాలలో గతంలో గంజాయిని చాక్లెట్ల రూపంలో విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో జోరుగా సాగుతున్న అక్రమ గంజాయి రవాణాపై నూతన ఎస్పి ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జిల్లాలో వరస ఘటనలతో అలజడి...**మార్కాపురం జిల్లాలో గతంలో ఎర్రగొండపాలెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని హత్య చేసిన నేరాలు ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచి ప్రారంభమైన హత్య రాజకీయాలు పెద్దారవీడు మండలంలో భార్యను పథకం ప్రకారం సుపారి ఇచ్చి హత్య చేయించిన ఘటన సంచలనం రేకెత్తించింది. పెద్దారవీడు మండలం పెగలపాడు గ్రామానికి చెందిన ఓ మహిళను రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశ చూపించి తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో ఎలాగైనా ఆమెను అంతం చేయాలని కుట్ర పని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దోర్నాల మండలం నల్లగుంట్ల గ్రామంలో రాజకీయ ప్రత్యర్థులు పాత కక్షల నేపథ్యంలో హత్య చేశారు. ఇలా జిల్లాలో వరుస హత్య సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా నివారించడానికి జిల్లా ఎస్పీ కి సవాళ్లు ఎదుర్కొనన్నాయి. జిల్లాలో నేర చరిత్రను తగ్గించేందుకు పోలీస్ వ్యవస్థ పటిష్టంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**వేధిస్తున్న సిబ్బంది కొరత**

మార్కాపురం జిల్లాలో యువజన అనంతరం పోలీస్ శాఖలో అధికారులు సిబ్బంది కొరత వేధిస్తుంది. నేరా నియంత్రణను అదుపు చేయటానికి అవసరమైన సిబ్బంది సమస్య ఉంది. జిల్లాలో ఇటీవలనే ఎస్పీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో అధికారుల సిబ్బందిని ప్రభుత్వం నియమించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో ఉండే మార్కాపురం పట్టణ గ్రామీణ పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తుంది. ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

# మండవ ఎంపిఎల్‌తో మాచర్లలో క్రికెట్ సందడి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 4)




మాచర్ల పట్టణంలోని ఎస్ కే డి ఆర్ కాలేజీ మైదానం నందు ఐదు రోజుల నుండి ఉత్కంఠ భరితంగా జరుగుతున్న మండవ ఎం పిఎల్ క్రికెట్ పోటీలతో మాచర్ల పట్టణంలో క్రికెట్ సందడి మొదలైంది. అటు యువతకు, ఇటు ప్రేక్షకులకు ఆనందాన్ని అందిస్తూ, క్రికెట్ క్రీడను వీక్షించడానికి పలు ప్రాంతాల నుండి క్రీడాభిమానులు వేలాదిగా పాల్గొంటున్నారు. రోజు రోజుకు ఆటగాళ్లలో పోటీ తత్వం నెలకొంటూ కేవలం 20 ఓవర్లలోనే అత్యధిక పరుగులను సాధిస్తూ తమలో ఉన్న ప్రతిభను కనబరుస్తున్నారు. ఆదివారం నాడు రెంటచింతల రాయల్స్, రింగురోడ్డు రాక్స్ మధ్య క్రికెట్ జరిగింది. ఈ మ్యాచ్లో ముందుగా టాస్ గెలిచిన రెంటచింతల రాయల్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. రెంటచింతల రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 177 రన్స్ చేసింది. అనంతరం బ్యాటింగ్కు దిగిన రింగ్ రోడ్డు రాక్స్ 18 ఓవర్లలో 5 వికెట్ల నష్టపోయి 181 పరుగులతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 51 బంతులలో 92 రన్స్ చేసి జట్టును విజయపథంలో నడిపించిన రింగ్ రోడ్డు రాక్స్‌కు చెందిన శాండీ రాజుకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివరెడ్డి అందజేశారు. అనంతరం కుర్రి శివారెడ్డి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో మండవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండవ ఎంపిఎల్ క్రికెట్ ద్వారా యువతను చెడు వ్యసనాల నుండి క్రీడల వైపు మళ్ళించాలని గొప్ప ఆలోచనతో తన సొంత ఖర్చులతో క్రికెట్‌ను నిర్వహిస్తున్న మండవ రవికి మాచర్ల నియోజకవర్గం యువత తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# రూ.4 కోట్లతో 3 తారురోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లింగసముద్రం మండలంలో సందడిగా కార్యక్రమాలు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 4)
జగన్ ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలే. ఒక్క తట్ట కూడా మట్టి వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ రోడ్లకు మోక్షం కలిగింది. పల్లె పండుగ 1,2, పీఎంజిఎస్ వై, నాబార్డ్, ఆర్ అండ్ బి తదితర నిధులతో ఈ రెండున్నర సంవత్సరాలలో నియోజకవర్గంలో 42.64 కోట్లతో 17 తారురోడ్లను నిర్మించాం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా 6 గ్రామాలకు కొత్తగా తారురోడ్లు నిర్మించేందుకు 9.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా లింగసముద్రం మండలంలో ఆర్ ఆర్ పాలెంలో పిఎంజిఎస్వై కింద రూ.1.15 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు, రూ.1.97 కోట్లతో నిర్మించనున్న విశ్వనాధపురం-గంగపాలెం తారురోడ్డు, రూ.90 లక్షలతో నిర్మించనున్న మేదరమిట్లపాలెం- జంగాలపల్లి తారురోడ్డు పనులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇన్నేళ్ల కష్టాలు తొలగేలా, తమ గ్రామాలకు కొత్తగా రోడ్లు ఏర్పాటు చేయబోతున్నందుకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ మూడు కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మేళ తాళాలతో నాగేశ్వరరావుకు స్వాగతం పలికారు. ప్రతి గ్రామానికి తారురోడ్డు, అంతర్గతంగా సిసి రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు



చేయడమే నా లక్ష్యమన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పల్లెల్లో కళ వచ్చింది. గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పనిచేస్తున్నాను అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శంకుస్థాపనల అనంతరం మూడు చోట్ల ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారం పై అధికారులకు అక్కడే ఆదేశాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మూడు గ్రామాలలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. అంతకుముందు ఆర్ఆర్ పాలెం వద్ద పొగాకు నారుమడిలో పనిచేస్తున్న కూలీలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. వారి వద్దకు స్వయంగా వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను దాదాపు నెరవేర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పార్టీలకు అతీతంగా పథకాలు చేరుతున్నాయి. ఇవన్నీ గుర్తుపెట్టుకుని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు సహకారం అందించి గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, గ్రామ పార్టీల అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, ఉన్నం రమేష్, కూరపాటి విజయ భాస్కర్, త్రోవగుంట వెంగళరావు, పార్టీ నాయకులు కిలారి రవి, కేతినేని మహేష్, వీరభద్రయ్య, బొల్లినేని నాగేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, కూరపాటి శ్రీను, సోంపల్లి మనోహర్, రాజారపు మాలకొండయ్య, పల్లపోతు వెంగళరావు, కిలారి కొండయ్య, అడపా రంగయ్య, నరసయ్య, కొండపనాయుడు, పూరిమిట్ల మాల్యాద్రి, గొర్రెపాటి సాంబయ్య, నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.







## నూజెండ్ల మండలంలో పడకేసిన పారిశుద్ధ్యం అధికారుల పర్యవేక్షణ లోపం పై గ్రామస్తుల ఆవేదన



(షణ్ముఖ వెలుగు, నూజెండ్ల, అక్టోబర్ 4)
మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోతోందని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్త వాహనాల ద్వారా సేకరించిన వ్యర్థాలను గ్రామ శివారుల్లో, ప్రధాన రహదారుల పక్కనే పడేస్తున్నారని తెలిపారు. దీంతో దుర్వాసన, దోమల బెడదతోపాటు రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, ఇంటింటి నుంచి చెత్త సేకరణను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది పనితీరుపై మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, రహదారుల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా స్వచ్ఛ భారత్‌కు సంబంధించిన అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను అభినందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 4)
గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబును నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ మున్సిపాలిటీ - 2026 రాష్ట్రస్థాయి అవార్డుకు గిద్దలూరు మున్సిపాలిటీ ఎంపిక కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పారిశుధ్యం, ఇంటి ఇంటి చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత కార్యక్రమంలో చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

## గాళ్ళ సుబ్రహ్మణ్యం కు నివాళులు



(షణ్ముఖ వెలుగు, విజయవాడ, అక్టోబర్ 4)
విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాలు నందు ఆదివారం జరిగిన కాపునాడు జాతీయ అధ్యక్షులు స్వర్గీయ గాళ్ల సుబ్రహ్మణ్యం సంస్మరణ సభకు హాజరై నివాళులర్పించి వారి కుమారుడు గాళ్ళ అరవింద్‌ని కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు పోగుల మల్లికార్జునరావు, జోన్ 4 కాపునాడు అధ్యక్షుడు బండారు మహేష్ నాయుడు, జనరల్ సెక్రెటరీ దాసరి పిచ్చయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షులు చెంగలశెట్టి సుధాకర్, జాయింట్ సెక్రటరీ గారా నారాయణరావు, మార్కాపురం జిల్లా అధ్యక్షులు పేరూరి భాస్కర్, మార్కాపురం మహిళా కాపునాడు పుట్టా లక్ష్మి, కాపునాడు మార్కాపురం జిల్లా కన్వీనర్ వెలుగోలు కాశీవిశ్వనాథ్, రాష్ట్రం నలుమూలల నుంచి కాపునాడు సభ్యులందరూ హాజరై ఘనంగా నివాళులర్పించారు.

## డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం

### ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఘన సత్కారం




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 4)
ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం లభించింది. గిద్దలూరు హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్‌గా ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిద్దలూరులోని విశ్వభారతి హైస్కూల్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు చేతుల మీదుగా డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు గురుబ్రహ్మ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, విద్యాబోధనతో పాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్య, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు డాక్టర్ పిచ్చయ్య చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఎన్‌సీసీ అధికారిగా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడం వంటి అంశాల్లో ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని సహచర ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురుబ్రహ్మ పురస్కారం అందుకున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సహచర ఉపాధ్యాయులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ పురస్కారం విద్యార్థుల కోసం మరింత బాధ్యతతో పనిచేసేందుకు తనకు ప్రేరణనిస్తుందని డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలిపారు.

## కందుకూరు పట్టణ వైసీపీ నాయకులతో సమావేశం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 4)
కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీకి సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 32 వార్డులలో పార్టీ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న వార్డు నాయకులందరూ సమిష్టిగా ఎన్నికలకు వెళ్దామని ఉత్సాహంగా తెలిపారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్పెషల్ టెట్ ఇంగ్లీష్ క్లాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)
యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ టెట్ క్లాస్‌లను ఒంగోలు యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై తెలియజేశారు. ఉదయం 10 గంటల నుండి 1ఏ కు సంబంధించిన ఎస్సీఈఆర్టీ వారి బిట్ బ్యాంకును 720 బిట్లను ఎక్స్‌ప్లెయిన్ చేయించడం జరిగింది. మధ్యాహ్నం 2ఏ సంబంధించిన ఎస్‌సిఈఆర్‌టి విడుదల చేసిన బిట్ బ్యాంక్స్‌ను ఎక్స్‌ప్లెయిన్ చేయించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ స్పెషల్ టెట్ క్లాస్ లను ఇన్సర్విస్ ఉపాధ్యాయులు అందరూ ఉపయోగించుకుని అందరు పాస్ కావాలని, అదే విధంగా ఎస్సీఈఆర్టీ మెటీరియల్‌ను అందరూ చదివి ఉత్తీర్ణత కావాలని కోరారు. రాష్ట్ర సంఘం గతంలో టెట్ మెటీరియల్, మోడల్ బిట్ బ్యాంకు తయారుచేసి అందించడం ద్వారా సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులు పాస్ కావడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం జాతీయ స్థాయిలో కలిసి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసిందని, రాష్ట్రస్థాయిలో అనేక చేసిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇన్స్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహిస్తుందని, అందుకోసం జిల్లా కేంద్రాలలో ఉపాధ్యాయులు ఉత్తీర్ణత కావాలని, 30 సంవత్సరాలు సర్వీస్ గల లెక్చరర్స్ చేత సైకాలజీ,ఇంగ్లీషు, ట్రై మెథడ్స్ మొదలగు సబ్జెక్టులలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని అన్నారు. చివరి వరకు ఉపాధ్యాయుడు వెంట ఉండి ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత కావడమే అంతిమ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వై వెంకట్రావు, జి ఉమామహేశ్వరి, ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






# ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 4)**

అక్టోబర్ 5 అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పొదిలిలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులుగా జిల్లా, మండల స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ఒకే వేదిక మీద ఘనంగా శాలువా కప్పి, పూలమాలవేసి, మెమెంటో తో సత్కరించారు. పొదిలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలో అతి కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గత మూడేళ్లుగా చేస్తున్నప్పటికీ ఈ సంవత్సరం అధిక సంఖ్యలో ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా పొదిలి నుంచి ఎంపిక కావడం గర్వకారణంగా భావిస్తూ వారందరినీ కూడా ఆదివారం పొదిలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవంగా వారిని సన్మానించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పొదిలి మండల విద్యాశాఖ అధికారి, మానవత ఎడ్యుకేషనల్ డైరెక్టర్ అయిన బీవీ రెడ్డి మానవత స్వచ్ఛంద సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు మువ్వల పార్థసారథి, రిటైర్డ్ మండల డిప్యూటీ విద్యాశాఖ అధికారి మామిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి, మానవతా స్వచ్ఛంద సంస్థ మాజీ జిల్లా అధ్యక్షుడు కాకునూరి ఎలమందరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, పిల్లి రమణారెడ్డి, పి బాల వెంకటేశ్వర్లు, బి యోగిరెడ్డి, కోటేశ్వరరావు, కార్యదర్శి చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, కోశాధికారి బండి అశోక్, ఉపాధ్యక్షుడు భూమా సుమంత్, వినోద్ రాజ్, ఎద్దు నగేష్, రాజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, భవాని శ్రీను, అవార్డు అందుకున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.










# సప్త నాగమాతా ఆలయంలో ఆత్మీయ సమావేశం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ వాస్తు జ్యోతిష్య అర్చక పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలు సప్త నాగమాతా ఆలయ ప్రాంగణంలో 4వ ఆత్మీయ సమావేశం, అంత్యేస్టి అపరం శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోధించు ఉపాధ్యాయులు బ్రహ్మశ్రీ ఇడమకంటి జనార్ధన శివాచార్య గురువు బ్రహ్మశ్రీ కొమ్మూరి విశ్వరూపాచార్యులు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ గోనుగుంట బ్రహ్మానంద శర్మ, గౌరవ సలహాదారులు బ్రహ్మశ్రీ గోనుగుంట నాగేశ్వర శర్మ, గౌరవాధ్యక్షులు బ్రహ్మశ్రీ గోనుగుంట మోహన కృష్ణశాస్త్రి, అధ్యక్షులు బ్రహ్మశ్రీ పోతులూరి శివబ్రహ్మాచార్యులు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ కడియంపాటి గౌరీశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మశ్రీ వేల్పూరి రామారావు, కోశాధికారి బ్రహ్మశ్రీ కోవూరి జగదీశ్వరాచార్యులు, బ్రహ్మశ్రీ ఉప్పులూరి చిన్న బ్రహ్మాచార్యులు, బ్రహ్మశ్రీ పాలెపు వెంకటేశ్వరశర్మ, తదితర పురోహితులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సహాయ, సహకారాలు అందించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

# సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ హర్షిణి విద్యార్థుల ఆధిపత్యం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల విజయానికి అధ్యాపకుల కృషి, మార్గదర్శకత్వం, కళాశాలలో ఉన్న ఉత్తమ విద్యా వాతావరణమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.

అలాగే సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ఎండీ గోరంట్ల హర్షిత్, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ దాది ఆంజనేయులు, జీఎం ఆర్ల శివరాం, ప్రిన్సిపల్ ఎం నాగేంద్ర, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని టాపర్స్‌ను సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని కళాశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

**కోర్సుల వారీగా టాపర్స్ వివరాలు**

బీఎస్సీ బోటనీలో ప్రథమ స్థానం సారిక భారతి గ్రేడ్ 9.25, ద్వితీయ స్థానం వేల్పుల స్వాతి గ్రేడ్ 8.66, తృతీయ స్థానం బోడెపోగు మనీషా గ్రేడ్ 8.32, బీఎస్సీ మ్యాథ్స్‌లో ప్రథమ స్థానం సౌమ్య రెడ్డి గ్రేడ్ 9.17, ద్వితీయ స్థానం సానే లావణ్య గ్రేడ్ 8.98, తృతీయ స్థానం షేక్ కరిష్మా గ్రేడ్ 8.97, బీసీఏలో ప్రథమ స్థానం షేక్ రిషిక గ్రేడ్ 9.16, ద్వితీయ స్థానం గొల్లపల్లి అమూల్య గ్రేడ్ 9.03,

తృతీయ స్థానం గుమ్మల యామిని గ్రేడ్ 9.00, బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రథమ స్థానం కర్నాటి స్పందన గ్రేడ్ 8.98,

ద్వితీయ స్థానం రాపూరి దుర్గాభవాని గ్రేడ్ 8.54, తృతీయ స్థానం ఇమ్మడిశెట్టి చాందిని గ్రేడ్ 8.53, బీకాం కంప్యూటర్స్‌లో ప్రథమ స్థానం పిడూరి శ్రీ సాయి సుమనస్విని గ్రేడ్ 8.92, ద్వితీయ స్థానం వాలేటి శ్రీవిద్య గ్రేడ్ 8.45, తృతీయ స్థానం పింద్రాల శంకరమ్మ గ్రేడ్ 8.43, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ప్రథమ స్థానం జమ్మలమూడి మానస గ్రేడ్ 8.67, ద్వితీయ స్థానం నల్లబోతుల అభినయ గ్రేడ్ 8.66, తృతీయ స్థానం కర్ర స్మైలీ గ్రేడ్ 8.63, బీబీఏలో ప్రథమ స్థానం జంగా జాకబ్ హేమంత్ రాజ్ గ్రేడ్ 8.53,

ద్వితీయ స్థానం మర్రెల్ల సాయి లక్ష్మీ దీపిక గ్రేడ్ 8.45, తృతీయ స్థానం సయ్యద్ తౌఫిక్ గ్రేడ్ 8.43, బీఏలో ప్రథమ స్థానం షేక్ పీర్‌లా ఆఫ్రీద్ గ్రేడ్ 8.45, ద్వితీయ స్థానం షేక్ ఖైమున్నిసా గ్రేడ్ 7.98, తృతీయ స్థానం పసుమర్తి సుజిత్ చంద్ర గ్రేడ్ 7.93లు పొందారు.

# ప్రజల పై ధరల భారం తగ్గించేందుకు చర్యలు

## రైతుబజార్లలో రూ.35కే ఉల్లి

## కొత్తపట్నం బస్టాండ్ రైతు బజార్‌లో ఉల్లి విక్రయాలు ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**




బహిరంగ మార్కెట్లో ఉల్లిధర అధికంగా ఉండుటతో కూటమి ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా కేజీ 35 రూపాయలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. నగరంలోని కొత్తపట్నం బస్టాండ్‌లో గల రైతు బజార్లో ఉల్లిపాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. బియ్యం ధర పెరగటం, ఉల్లి ధర పెరుగుదల, టమోటా లాంటి వాటికి ధరలు పెరగటంతో ప్రజలు బహిరంగ మార్కెట్లో కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారని అందుకోసం జిల్లాలోని నాలుగు రైతు బజార్లలో బియ్యము ఉల్లిపాయలు విక్రయ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంచామని అన్నారు. పొద్దుటూరులో ఉల్లిపాయలను దిగుమతి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డుతో లేక రైస్ కార్డుతో రెండు కేజీలు లెక్కన అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉ డా చైర్మన్ షేక్ రియాజ్, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, డీఎస్ఓ పద్మశ్రీ, మార్కెటింగ్ ఏడి వరలక్ష్మి మాజీ కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, ఏ శాండిల్య, కపిల్ బాషా, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం కొత్తపట్నం సముద్ర తీరంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో, మరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో బీచ్ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా సముద్ర తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు, ప్లాస్టిక్, ఇతర చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా మార్చేందుకు రోటేరియన్లు, మెరైన్ పోలీస్ సిబ్బంది కలిసి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ప్రెసిడెంట్ కోగంటి గోపాలకృష్ణ, సెక్రటరీ గుమ్మడి శ్రీధర్, కోశాధికారి విజయ్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బందారు లక్ష్మీనారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ రావిపాటి శ్రీనివాస్, పాస్ట్ సెక్రటరీ నర్రా సురేంద్ర, పాస్ట్ కోశాధికారి ఆర్ల శ్రీరామమూర్తి, ఎలెక్ట్ ప్రెసిడెంట్ మొలకలపల్లి హరిబాబు, వైస్ ప్రెసిడెంట్ బొమ్మినేని రమణ, మెరైన్ ఎస్ఐ పసుపులేటి సుబ్బారావు, మెరైన్ పోలీస్ సిబ్బంది, రొటేరియన్లు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

ఒంగోలు నగరం లోని స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏపీటీసీఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు పట్టణ అధ్యక్షురాలు ఈవీఎస్ లక్ష్మీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు హాజరయ్యారు. అలాగే ఉడా చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకట్రావు , ఏపీఎస్ రాష్ట్ర నాయకులు పి సుబ్రహ్మణ్యరాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ పి ప్రకాష్‌బాబు, రాష్ట్ర మహిళా నాయకురాలు ఈవిఎస్ లక్ష్మీ , హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, గౌతమి విద్యాసంస్థల రఘునాథ్ బాబు, రైజ్ కాలేజీ రమేష్, మైత్రి అకాడమీ రామారావు, జీఎన్ఆర్ అకాడమీ నాగేశ్వరరావు, ఫేస్ ఎన్ఆర్ కాలేజీ అధినేత నాగేశ్వరరావు, తదితరులు, అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న సుమారు 110 మంది ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో అభినందనీయమని



అన్నారు. ఏపీటీసీఏ ఆధ్వర్యంలో ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని ఆయన అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఏ సమస్య వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 35 పాఠశాలల నుంచి 110 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసరావు , సీబీ మైకేల్, జాల్‌రెడ్డి, శివప్రసాద్, రామిరెడ్డి, బొమ్మల శ్రీనివాసరావు, జేబీనా మేడం, శ్రీరాములురెడ్డి, గద్దగుంట సుబ్బారావు, గీతాంజలి శ్రీనివాసులు, సౌజన్య, నోబుల్, ఎం శేఖర్‌బాబు, యేసుపాదం, జమీర్ భాయ్, కోటి సార్, తదితరులు పాల్గొన్నారు.







## బాలవిహార్ విద్యార్థులకు స్తోత్రాలు భజన సంకీర్తనల్లో శిక్షణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవనంలో శ్రీగిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులకు ఆదివారం నుండి స్తోత్రాలు భజన సంకీర్తనలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. స్వామిని శారదా ప్రియా నంద సంకలనం చేసిన శ్రీ చిన్మయ స్తోత్ర భజనమాల గ్రంథంలోని స్తోత్రాలను భజన సంకీర్తనలను విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందని చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద వెల్లడించారు. బాలవిహార్ విద్యార్థులకు భగవద్గీత పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి పర్యవేక్షించారు. విద్యార్థులకు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

## పదవీకాలం పూర్తయిన జడ్పీటిసీలు, ఎంపీపీలకు సత్కారం





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 4)

కందుకూరు నియోజకవర్గ జడ్పీటీసీలు, ఎంపీపీలు పదవీ కాలం పూర్తయిన సందర్భంగా ఒంగోలు జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 35 రూపాయలకే కిలో ఉల్లిపాయలు కందుకూరులో అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 4)

ఎల్‌నినో ప్రభావంతో నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని తక్కువ ధరకే ప్రజలకు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. బహిరంగ మార్కెట్లో కిలో ఉల్లిపాయల ధర రూ. 60–65ల వరకు ఉండగా కేవలం రూ. 35లకే అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కందుకూరు రైతు బజార్లో ఏర్పాటు చేసిన ఉల్లిపాయల అమ్మకం కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. పెరుగుతున్న ధరల ప్రభావం పేదలపై పడకుండా, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అంతకుముందు రైతు బజార్ అధికారులు, స్థానిక నేతలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ రాయపాటి సుభాషిణి, ప్రకాశం జిల్లా మార్కెటింగ్ ఏడి వరలక్ష్మి, ఎన్ఫోర్స్మెంట్ డిటి విజయ్ భాస్కర్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్వరూపారాణి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కొత్తూరు సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, షేక్ సలాం, సయ్యద్ రూబీ, షేక్ నజీర్, జియావుద్దీన్, మురారిశెట్టి వెంకట సుబ్బారావు, కూనం నరేంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.







## నేలటూరులో అధియోగి శ్రీచక్ర పిరమిడ్ ధ్యానమందిరం ప్రారంభించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్








(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, అక్టోబర్ 4)

మద్దిపాడు మండలంలోని నేలటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన అధియోగి శ్రీచక్ర పిరమిడ్ ధ్యానమందిరన్ని సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ హాజరై ధ్యానమందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యానం, ఆధ్యాత్మిక చింతనకు ఇటువంటి ధ్యానమందిరాలు వేదికలుగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), నన్నూరి శ్రీనివాసరావు, దూంప కృష్ణమోహన్ రెడ్డి, పప్పుల యువరాజ్, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్‌కు లేని 50 శాతం పరిమితి బీసీ రిజర్వేషన్ పైన ఎందుకు?

**50 శాతం ఉన్న బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కూడా**
**హైకోర్టు కొట్టివేయటం మనువాదమే**
**బీసీ రిజర్వేషన్ల పై చంద్రబాబు తన పబ్బం గడుపుకోవడానికి**
**జీవో కాకుండా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేయించాలి**
**దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

ఈడబ్ల్యుఎస్ పేరుతో అగ్రకులాలకు 50 శాతాన్ని మించి రిజర్వేషన్లను మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు అమలు చేస్తున్నప్పుడు వ్యతిరేకించని న్యాయస్థానాలు 50 శాతం జనాభా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్ జిఓను కొట్టివేయటం చంద్రబాబు జిమ్మిక్ అని నీలం నాగేంద్రరావు విమర్శించారు. ఆదివారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేందర్రావు మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలు గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం పట్టణ ప్రాంతాల్లో 52 శాతం బీసీలు ఉన్నారని నిర్ధారించాలన్నారు. రానున్న స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు పంచాయతీలలో రిజర్వేషన్లు జనాభా నిష్పత్తి ప్రకారం 50.2 శాతం అమలు చేయవలసి ఉండగా చంద్రబాబు కేవలం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బూటకపు జీవో తెచ్చారన్నారు. బీసీలు అంటే బ్యాక్వర్డ్ కాదని తమ పార్టీకి బ్యాక్ బోన్ అని బాకాలు ఊదే చంద్రబాబు లోకేష్ బీసీమంత్రులు బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలన్నారు. తాను బీసీ కులస్తుడనని చెప్పుకునే విశ్వగురు ప్రధానమంత్రి మోడీకి గొడుగు పడుతున్న చంద్రబాబు స్థానిక ఎన్నికల్లో గెలవడం కోసం బీసీ రిజర్వేషన్ 34% పెంచుతూ బూటకపు జీవో తెచ్చి బీసీ ఓటర్లను బకరాలు చేశారన్నారు. చట్ట సభలైన పార్లమెంట్ అసెంబ్లీలలో ఎస్సీ ఎస్టీలకు కేటాయించినట్లే అసెంబ్లీ,పార్లమెంట్ సీట్లు బీసీలకు కేటాయించాలని మోడీ అమిత్ షా భజన చేస్తున్న అమరావతి కమ్మని ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. చట్టసభలైన పార్లమెంటు అసెంబ్లీ సీట్లలో అగ్రకుల వ్యాపారులకు సీట్లు కేటాయిస్తూ అధికారాన్ని అష్టగతం చేసుకొని సమస్త సంపదను దోచుకుంటున్న అగ్రకుల పార్టీలు తమ అధికారాన్ని ప్రశ్నించకుండా తమకు ఎదురు తిరగకుండా ఎంగిలి మెతుకులు విసిరేసినట్లు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతున్నట్లు కోర్టులు కొట్టేస్తున్నట్టు కమ్మని పచ్చ నాటకాలు ఆడుతున్నారన్నారు. తమిళనాడులో 69% రిజర్వేషన్లు అమలవుతుండగా ఆంధ్ర ప్రదేశ్ లో 50% రిజర్వేషన్లు పెరగకూడదని సుప్రీంకోర్టు చెప్పటం సరికాదని రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పును మార్చుకోవాలన్నారు. పార్లమెంటులో చేయవలసిన ఎస్సీ వర్గీకరణ ను సుప్రీంకోర్టు మోడీ కను సన్నల్లో రాజ్యాంగానికి వ్యతిరేకంగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం చేసిందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం 50 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా 50 శాతం ఎమ్మెల్యే ఎంపీ సీట్లు ఇవ్వాలని టిడిపి బ్యాక్ బోన్ పార్టీ అని ప్రకటించుకుని పల్లా వెంకట్రావు అను బీసీని పార్టీ అధ్యక్షుడిగా నియమించినట్లే ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల పట్ల వారి ఓట్లు పట్ల చిత్తశుద్ధి ఉంటే వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయాలని నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మేడికొండ మురళి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, తదితరులు ఉన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వండి

## మాజీ మంత్రి బాలినేనిని కలిసిన టిడ్కో చైర్మన్ అజయ్ బాబు





**(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, అక్టోబర్ 4)**

మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులోని వారి నివాసంలో టిడ్కో చైర్మన్ అజయ్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలువ బొకే తో ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో వారి ఇరువురి మధ్య ప్రస్తుతం రాష్ట్రము లో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై కూలంకషంగా చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకొని పార్టీ నాయకులను, కార్యకర్తలను ఒక తాటిపై నడిపించుటకు తోడ్పడాలని అజయ్‌బాబుకు బాలినేని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏ అభ్యర్థులనయితే సంస్థగత ఎన్నికల్లో ప్రాధాన్యత ఇచ్చి నిలబెడితే వారి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వెల్లడించారు. బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసిన వారిలో మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎంఎన్ రెడ్డి, జనసేన నాయకులు, తదితరులు ఉన్నారు.

# ట్యాంకర్ బిల్లులు ఇప్పించండి

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో**
**మంత్రి నారాయణను కోరిన పొదిలి నీటి ట్యాంకర్ కాంట్రాక్టర్లు**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 4)**

పొదిలి మునిసిపాలిటీ పరిధిలోని త్రాగు, వాడుక నీటి ఎద్దడి ఉన్నటువంటి వార్డులలో 30-07-2024 నుండి 31-08-2025 వరకు మడు టెండర్ల ద్వారా ఒక కోటి ఇరవై లక్షల రూపాయలు, సదరు నిధుల ద్వారా డీప్ బోర్స్, పైప్ లైన్ నిర్మాణం రూ.24 లక్షల రూపాయల పనులు చేసియున్నాం. వాటికి సంబంధించిన బిల్లులు నేటి వరకు కూడా తమకు అందలేదని కాంట్రాక్టర్లు ఆదివారం నెల్లూరులోని మున్సిపల్ మంత్రి నారాయణ స్వగృహంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ కమిటీ కన్వీనర్లు అయిన తాము వార్డులలో ప్రజలకు మన కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు నీటి సౌకర్యం కల్పించుటకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసియున్నామన్నారు. విజయవాడ వరదలు వచ్చినప్పుడు పొదిలి పట్టణం నుండి 20 ట్యాంకర్లకు సొంత నిధులు వెచ్చించి విజయవాడ నగరము నందు ప్రజలకు మంచినీటి సరఫరా చేసి వారికి తమ వంతుగా సహకారం అందించామన్నారు. తామంతా కూడా మధ్యతరగతికి చెందినవారమని తెలిపారు. తాము గత వైసిపి ప్రభుత్వంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి మా వార్డులలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి గెలుపుకు తోడ్పడి అత్యధిక మెజారిటీ సాధించామన్నారు. 2024-2025 వరకు తమకు రావలసిన ఎస్‌డిఆరఎఫ్ నిధులు రాకపోవడం వలన తాము, తమ కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురువుతున్నామన్నారు. ఈ విషయమై తమరికి రెండు పర్యాయములు విన్నవించుకున్నామన్నారు. ఈ విషయమై తమ కార్యాలయం నుండి మా యొక్క నిధుల వివరములు అడిగియున్నారు. అయినా తమకు నిధులు విడుదల కాలేదన్నారు. మా యందు దయ ఉంచి పార్టీ బూత్ కమిటీ కన్వీనర్లు, వారి కుటుంబాలు రోడ్డున పడకుండా తమకు రావలసిన ఎస్‌డిఆరఎఫ్ నిధులు ఒక కోటి నలభై నాలుగు లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి తమను అప్పుల బాధల నుండి ఆదుకోవాలని మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్, సురేష్, రాము, కాటూరి హనుమంతరావు, తదితరులు ఉన్నారు.

# నగర అభివృద్ధికి పునాదులు వేసిన మహానుభావుడు స్వర్గీయ పునుగుపాటి కోటేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

నగర అభివృద్ధికి పునాదులు వేసిన మహానుభావుడు స్వర్గీయ మాజీ శాసనసభ్యులు పునుగుపాటి కోటేశ్వరరావు అని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. స్వర్గీయ పొనుగుపాడు కోటేశ్వరరావు 38వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా అద్దంకి బస్టాండ్ లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామైన నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దంపతులు వాళ్ల కుటుంబ సభ్యులతో వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నగర అభివృద్ధితోపాటు ఆర్టీసీ డిపో నిర్మాణం, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టిన వ్యక్తి అని అన్నారు. అలాంటివారిని ప్రజలప్పుడు మనసుల్లో గుర్తు పెట్టుకుంటారని వారి ఆశయాలను ప్రజలు ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు మదన్, మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసిరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వై వి సుబ్బారావు, పప్పు శ్రీనివాసరావు, పాలపర్తి లక్ష్మీనారాయణ, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, బెజవాడ మురళీకృష్ణ, ఆర్ల వెంకటరత్నం, పసుపులేటి సునీత, నాలం నరసమ్మ, బోను దుర్గ, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పొనుగుపాటి కోటేశ్వరరావుకు నివాళి

## ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

నాగులుప్పలపాడు మండలంలోని పోతవరం గ్రామంలో దివంగత పొనుగుపాటి కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విజయ్ కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), గ్రామ టీడీపీ నాయకులు, కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ వెహికల్ ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



**(షణ్ముఖ వెలుగు, పెద్దరవీడు, అక్టోబర్ 4)**

ద్విచక్ర వాహనాన్ని ఆర్టిసి బస్సు ఢీకొని ప్రతి మృతి చెందిన సంఘటన మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోకపల్లి గ్రామానికి చెందిన నరాల వెంకటేశ్వర్లు (50) కుంట సమీపాన నుంచి రాజంపల్లి గ్రామంలో ఉన్నటువంటి బత్తాయి తోటకు వెళుతున్న నేపథ్యంలో వెనక నుంచి వచ్చి ఆర్టిసి బస్సు ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం పై ఉన్న నరాల వెంకటేశ్వర్లు అక్కడికక్కడే రోడ్డు పై బోల్తాపడ్డాడు. ఈ నేపథ్యంలో ఆయన తలకు బలమైన గాయాలు తగలడంతో చికిత్స నిమిత్తం మార్కాపురం తరలించారు. ఈ నేపథ్యంలో ఆయన అక్కడ మరణించినట్లు పోలీసులు తెలిపారు. పెద్దారవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com